# అపుత్రస్య...

మూడుమాసాల క్రిందట ఆ ఇంట్లో అద్దెకు చేరినపుడు, ఇల్లు వసతిగా ఉంటుందనుకున్నాడే గాని, ఆ ఇంటివారు ఇంత మంచిగా ఉంటారని నారాయణ అనుకోలేదు. ఆ ఊరు బదిలీ అయ్యాక, ఇది మూడో ఇల్లు అతను మారడం! కొన్ని కొంపలు తనకు నచ్చలేదు, కొన్ని సుజాతకు నచ్చలేదు. ఇద్దరికీ నచ్చిన ఇండ్లున్నాయంటే, భరించలేని అద్దెలు! కొద్ది కిరాయిలో ఇండ్లు లేవని కాదు గానీ, అవి ఆఫీసుకు వల్లమాలిన దూరంలో ఉన్నాయి. రానూ పోనూ బస్సుచార్జీలు, రిక్షా ఖర్చులు కలుపుకుంటే తడిసి మోపెడవుతుంది !

ఏ గంగలో దూకేట్టు?

"లింగు లింగుమంటూ ఇద్దరమే ఉంటే, ఏ గదిలో తలదాచుకొన్నా సరిపోతుంది. ఇప్పుడల్లా కాదామె! ఐదుగురు పిల్లలూ, వచ్చీపోయేవాళ్ళూ - వీళ్ళందరికీ రెండు గదుల కొంప సరిపోతుందా?" అన్నది సుజాత.

"మీ నాన్నగారిని రెండంతస్తుల మేడ కట్టివ్వమనక పోయావా?" అన్నాడు నారాయణ చిరాకుపడుతూ.

"అలా కట్టించే మామగారినే చూసుకోకపోయారా! మా నాన్నగారొచ్చి మిమ్మల్నే మీ ప్రాధేయపడలేదే! కట్నంకూడా పుచ్చుకోకుండా చేసుకొంటామని మీరేగా అన్నారు?" అన్నది సుజాత.

"మరేం చావను! ఇంత మంచి కళ్ళున్న అమ్మాయి, కట్నంతో సహా రాదుగదా!"

శంకరంగారిల్లు చూసొచ్చాక, నారాయణ ప్రాణం కుదుటబడింది.

"ఇల్లు బాగా వుందే! ఇంటాయనకూ మనకూ ఏమీ సంబంధం లేదు. వంటగదీ, మధ్యహాలూ కాక, రెండు గదులున్నాయి. వెనకాతల పెద్ద పెరడూ, బావీ, ముందుగా వసారా, దాన్నానుకొని జాజి పందిరీ!" అన్నాడు నారాయణ నవ్వి.

నారాయణ 'జాజి పందిరి' అనేసరికి సుజాతకు నవ్వాగలేదు.

"అద్దెకూడా ఫర్వాలేదు. అదీగాక, ఆఫీసుకు పదినిమిషాలదూరం, స్కూలుకూడా రెండు బజార్లవతల వుంది."

"బయానా ఇవ్వకపోయారా?" అన్నది సుజాత.

"తీసుకోమన్నాను. ఆయన ఒప్పుకోలేదు. ఆడవాళ్ళను వచ్చి చూసుకోమన్నాడు. ముందుగా వాళ్ళకు నచ్చడం అవసరమన్నాడు. ఇన్ని సదుపాయాలున్న కొంప, ఇంత తక్కువలో దొరకడం మాటలుకాదు. తరవాత నీయిష్టం" అన్నాడు నారాయణ.

ముందుగా సుజాత కెన్నో అనుమానాలు తోచిన మాట నిజం! ఇల్లు చూద్దామా, లంకంత వున్నది. దేనికీ బయటికి పోవలసిన అవసరము లేదు. ఆఖరుకు కూరగాయలు కూడా వీధిలోకే వస్తాయి. ఇంత మంచి ఇల్లు ఇంతకాలం దాకా, మరొకరికి అద్దె కివ్వకుండా ఉండడమే చిత్రంగా ఉంది !

"అద్దెకిస్తే గానీ గడవందేమీ లేదు చెల్లమ్మా! భగవంతు డేదో మాకూ ఇంత తినటానికి ఇచ్చాడు. మీ బావగారైనా ఉద్యోగం చెయ్యాల్సిన అవసర మేమీ లేదు-ఊరికే ఉండడ మెందుకనీ, కాలక్షేపంగానన్నా ఉంటుందనీ, ఆయన ఆఫీసుకు పోతున్నారుగానీ-" అన్నది జయమ్మ.

వారం రోజులు తిరక్కుండానే సుజాతకూ, జయమ్మకూ మంచి దోస్తీ ఏర్పడింది. పిల్లలు కూడా ఆవిడకు బాగా మాలిమయ్యారు. స్కూలుకెళ్ళే వేళకు, ఒక్కోసారి కూరా, నారా కాకపోతే, జయమ్మే ఇంత వండి పంపించేది! పెద్దవాడూ, రెండోవాడూ నాగభూషణందగ్గర కూచుని చదువుకోడం ప్రారంభించారు. ఒక్కోరోజు తోటివాడు వస్తే వచ్చేవాడు, లేకపోతే జయమ్మగారి దగ్గరే పడుకొనేవాడు.

సుజాత వాణ్ని తీసుకురాబోతే, జయమ్మ వొద్దనేది కూడాను!

నిద్రపోతున్న చంటివెధవను, ఇప్పుడేం తీసుకుపోతావు లేవమ్మా! ఇవ్వాళ నా దగ్గర పడుకొంటాళ్ళే పోనీ!" అనేది జయమ్మ.

"ఓ రాత్రివేళ లేస్తాడేమోనండీ! లేవడమే తడవు రాగమెత్తుకుంటాడు కూడా!" అనేది సుజాత.

"ఏడిస్తే తీసుకొచ్చిస్తాను, సరా!"

"జయమ్మ నిజంగా దేవతలాంటి మనిషండీ!" అన్నది సుజాత వొకసారి.

"ఏం కథ?" అన్నాడు నారాయణ.

"పండక్కి గుడ్డలు కావాలని ఉదయం పద్దుముండ మంకుపట్టు పట్టింది. నా దగ్గరా, పాతిక్కూడా లేవాయె! వాటితో యూనిఫారమే కుట్టించనా, పద్దుకు లంగాగుడ్డే తీసుకోనా?" అన్నది సుజాత.

"దానికీ, జయమ్మ దేవత కావడానికీ సంబంధమేమిటో నాకు తెలియకుండా ఉంది!"

"మీదంతా వొకటే తొందరా!" అన్నది సుజాత నవ్వుతూ. "జయమ్మగారేం చేశారో తెలుసా? నన్ను దొడ్లోకి పిలిచింది. వందరూపాయల కాగితం రొండినించి తీసి నాకిచ్చి, పద్దుకు, పిల్లలకూ గుడ్డలు కొనమన్నది. మీకూ, వో జత పంచెలు తీసుకోమన్నది. తను రేపో ఎల్లుండో, బజారు వెళుతుందట. తన ఖాతాలో నాకూ ఓ చీర తీసుకొంటానన్నది. ఈ సంగతి మీతోకూడా చెప్పొద్దన్నదండీ!"

"మరి చెప్పావేం?" అన్నాడు నారాయణ.

"[illegible] [illegible]న్నింటినీ చూసి ఎక్కడివని అడిగితే, [illegible] సతమతం కావాలి. ఆ సంగతేదో [illegible]చే పీడా పోతుంది!" అన్నది సుజాత.

నారాయణ ఒసారి వసారాలోకి తొంగిచూసి, పెద్దవాళ్ళిద్దరూ నిద్రపోతున్నారని రూఢి చేసుకొన్నాక సన్నగా నవ్వాడు.

సుజాత ఏమిటన్నట్టుగా చూసింది!

“ఈపూట మరీ చలిగా ఉందిగదులే! దుప్పటి కప్పుకొన్నా ఆగేటట్టు కనిపించడంలా! అవునా?” అన్నాడు నవ్వుతూ.

అవునో కాదో సుజాత చెప్పలేదుగానీ, ఆవిడ కిటికీలు కూడా మూసి, నిశ్శబ్దంగా తలుపుకు గడియబెట్టేసింది!

* * * *

భార్యను పుట్టింటికి పంపించి వొచ్చేశాక, నారాయణకు మతిపోయినట్లయింది. నిజానికి ఇప్పుడావిడ పోవలసినంత అర్జంటు పనేమీలేదు. పిల్లలు తాతయ్యను చూడాలంటున్నారన్నదంటే, అది కేవలమూ ఓ వంకగానీ, నిజమని తనకే అనిపించలేదు.

“ఎండాకాలం సెలవులు ఇవ్వనే ఇచ్చారు. స్కూళ్ళు పోతాయనుకోటానికీలేదు. ఈ మూడేళ్ళ నించీ నేను మాత్రం వెడతానన్నానా? మా రెండో తమ్ముడి వడుగయ్యాక వాణ్ణి నేను చూడకనే పోతిని!” అన్నది సుజాత.

ఆవిడకు వత్తాసుగా జయమ్మకూడా వచ్చింది!

“వెళ్ళి రానివ్వండి. అయినవాళ్ళను చూడాలని మీకున్నట్టే మాకూ ఉంటుంది. ఎటొచ్చీ మీరు మగవాళ్లు గనక, బుద్ధిపుట్టినప్పుడు చూసొస్తారు. ఆడపుటక పుట్టి

నందుగ్గాను, మాకా ప్రాప్తం లేకుండా ఉంది!" అన్నది జయమ్మ.

నారాయణ ఏమనడానికీ అవకాశం లేకపోయింది.

అతను ఆఫీసునుండి వస్తూనే హోటల్లో భోజనం చేశాడు.

"అదేమిటీ మీ కోసం వంట చేసుకున్నా-చుంటే, మీ రెక్కడో తిని రావడం భావ్యంగా లేదండీ!" అన్నాడు నాగభూషణం!

"ఫర్వాలేదులెండి!" అన్నాడు నారాయణ నీళ్ళు నములుతూ.

"ఫర్వా ఉంటుందో లేదో నాకు తెలియదు. మీరు మాత్రం రేపణ్నించీ, హోటలు కెళ్ళడానికి లేదు. మీకా తిండి సరిపడదుటగా! చెల్లెమ్మ అన్ని సంగతులూ చెప్పింది లెండి! అసలందువల్లనే ఆవిడ ఇంతకాలంగా పుట్టింటికి వెళ్ళ లేదుట కూడానూ" అన్నది జయమ్మ.

నారాయణ వసారాలో ఏదో చదువుకొంటున్నాడు. జయమ్మ నిశ్శబ్దంగా లోపలికి వెళ్ళి, పది నిమిషాల తర్వాత బయటకొచ్చింది.

"మంచం ప్రక్కనే మంచినీళ్ళ చెంబు పెట్టాను. బల్ల మీద తాంబూలం ఉంది... తలుపుకు గడియ పెట్టుకొనే పడుకొంటారుగా!... ఏమన్నా అవసరమయితే మొఖమాట పడకండి! పిలిచి అడగండి," అంటూ జయమ్మ రెండడుగులు ముందుకు వేసిందల్లా, మళ్ళా వెనక్కొచ్చి, ఏదో

రహస్యం చెబుతున్న దానిలా కొద్దిగా ముందుకు వంగింది. "మీ అన్నగారిని అడగడానికి మీకంత సిగ్గయితే, ఆయనకు తెలీకుండా నాతో చెప్పండి! అన్ని విషయాలూ, అందరకూ తెలియడం అంత మంచిదికాదు."

నారాయణ ఏమీ అనలేదు. జయమ్మ వెళ్ళినవేపే నిశ్శబ్దంగా చూస్తూ కూచుండిపోయాడు.

"రాత్రి మీకు సరిగ్గా నిద్ర పట్టి ఉండదు. అవునా?" అన్నది జయమ్మ ఆ మొర్నాటి ఉదయం అతను స్నానం చేసి రాగానే.

"అదేం లేదే!" అన్నాడు నారాయణ.

"అబద్ధమాడకండి! మీ కళ్ళే చెబుతున్నాయి," అని ఓ క్షణం ఆగి, "అయినా ఒంటరిగా ఉన్నారుగదా! నిద్రెలా పడుతుందిలెండి" అని ముగించింది.

నారాయణ కాస్త పరధ్యానంగా ఉండడం గమనించి, "మరో పావుగంటకల్లా వంట పూర్తవుతుంది. మీరెప్పుడొచ్చినా సరే!" అన్నది జయమ్మ.

"ఎప్పుడొచ్చినా సరే!" అన్న వాక్యం కాస్త తగ్గు స్థాయిలో అన్నట్లనిపించింది నారాయణకు.

నారాయణకు ఊహాశక్తి లేదనికాదు. ఆ వొక్క వాక్యాన్ని ఆధారం చేసుకొని, ఎన్నింటినైనా భావన చెయ్యగలడు. కానీ అంత సాహసానికి వొడిగట్టలేకపోయాడు.

ఆ రాత్రి భోజనాలయ్యాక, నాగభూషణం సినిమా ప్రోగ్రాం పెట్టాడు. జయమ్మ నారాయణకేసి చూసింది.

"రాకూడదూ?" అన్నాడు నాగభూషణం!

"ముందు మీరు వెళ్ళిరండి! బాగా ఉంటే నే నొక్క-దాన్నే చూస్తాను." అన్నది జయమ్మ, సాభిప్రాయంగా నారాయణకేసి చూస్తూ.

ఆ సినిమాకు పోవడం, ఆవిడ కిష్టంలేదని నారాయణ గ్రహించాడు.

"ఏమండీ! పోనీ మీరన్నా వస్తారా?" అన్నాడు నాగభూషణం!

"మరిదిగారు సాయంత్రంనుండీ తలనొప్పిగా వున్నదంటు న్నారు. ఆయన్ని మీరలా మొఖమోట పెట్టకండి! అసలే వాళ్ళావిడ, పువ్వో పువ్వో మంటూ ఆయన్ను చూసు కొంటున్నది. మీరు వెళ్ళిరద్దురూ!"

నాగభూషణం, "వీధి తలుపు తీసే వుందేవ్" అంటూ వెళ్ళిపోయాడు.

జయమ్మ అతనివెంటనే వెళ్ళి, నాగభూషణం వీధి మలుపు తిరిగిందాకా చూసి, తలుపు గడియబెట్టి మరీ వచ్చింది!

"అలా అన్నానని మీ కేమీ కోపం లేదుగదా!" అన్నది జయమ్మ, కుర్చీని అతనికి దగ్గరగా లాక్కు-ంటూ. "మీరూ వెళ్ళిపోతే వొక్క-దాన్నే బిక్కు- బిక్కు-మంటూ కూచోవాలి. అందాతే మిమ్మల్ని వుండమన్నాను"

"మీరు వెళ్ళకపోయారా! మిమ్మల్ని చూశాక, మీరూ వెడతారేమో ననుకున్నాను" అన్నాడు నారా యణ.

"మీ కెందుకలా అనిపించిందీ?"

ఎందు కనిపించిందో నారాయణ చెప్పగలడు. కానీ చెప్పలేకపోయాడు.

ఓ నిమషంపాటు, అతనేదన్నా చెబుతాడేమో నని చూశాక, సన్నగా నిట్టూర్పు విడిచింది జయమ్మ.

"నే నేమో అనుకొన్నాను గానీ, మీరూ అసాధ్యు లేనే!" అని నవ్వింది జయమ్మ. "అసలు సినిమాకనే నేనూ తల దువ్వుకొని, చీరె మార్చుకొన్నాను. అన్నట్టు చెప్పడం మరిచిపోయాను... నా చీరలింకా రాలేదు. అందుకని బీరువా లోంచి సుజాతచీర తీసి కట్టుకొన్నాను. ఇది మీ ఆవిడదే! మీరు కనుక్కొంటా రనుకొన్నానే!"

"మా ఆవిడ దనుకోలేదు గానీ-"

జయమ్మ ఆవలించింది!

"రండి. ముందు మీకు పక్క వేసొస్తాను... తల నొప్పిగా ఉండేవాళ్లు, ఎక్కువసేపు ఆరుబయట కూచోవడం అంత మంచిది కాదు"

జయమ్మ ముందుగా గదిలోకొచ్చింది— ఆ తరువాత నారాయణ వచ్చాడు.

—పన్నెండు గంటలప్పుడు, జయమ్మ వొక్కతే పక్క వాటాలోకి వెళ్ళిపోయింది. నారాయణ ముసుగుతన్ని పడు కొన్నాడు.

సుజాత పుట్టింటి కెళ్ళిపోయిందన్న కొరతను నారా యణ ఏ విషయంలోనూ అనుభవించలేదు.

"మీ కేమీ ఇబ్బందిలేదుగదా!" అంటుండేవాడు నాగభూషణం అప్పుడప్పుడు.

"అబ్బే! ఏం లేదండీ!" అనేవాడు నారాయణ, జయమ్మకేసి చూస్తూ.

"ఇవ్వాళ మీ చెల్లెలికి ఉత్తరంరాసి పడేశాను" అన్నాడు నారాయణ ఒక రాత్రి.

జయమ్మ ఏదో ఆలోచిస్తూ ఉన్నదల్లా నారాయణ వేపు తిరిగి, సన్నగా నవ్వింది.

"వచ్చేప్పుడు, చలిమిడీ చక్కెరాలూ తెస్తుందన్నమాట!"

"అవే ఎందుకూ తీసుకురావడం?" అన్నాడు నారాయణ విస్తుపోయి.

"సూడిదలు తెచ్చేప్పుడు. ఏమున్నా లేకపోయినా, నువ్వులుపోసిన చలిమిడి తప్పకుండా వుండాలి. బిడ్డా, పాపా లేనిదాన్ని నాకే ఇన్ని సంగతులు తెలుసుగదా, మీకు తెలియకపోవడ మేమిటండీ?" అన్నది జయమ్మ, కిటికీరెక్కలు మూస్తూ.

"ఓ అదా సంగతీ!" అన్నాడు నారాయణ, పక పకా నవ్వుతూ. "ఇక మా కా బెడద లేకుండా వొదిలించుకున్నాను... మా కోటిగాడు పుట్టినప్పుడు ఆవిణ్ని ఆపరేట్ చేయించుకోమన్నాను. భయపడింది. పోనీగదాని, నేనే ఆపని చేయించుకున్నాను."

జయమ్మ ముఖంనిండా చెమటలు కమ్మడానికి కారణ మేమిటో నారాయణకు బోధపడలేదు.

—o—